సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 7 । జూన్ । 2023



అమ్మ..బిడ్డ..ఆనందం

జిల్లాలో మాతాశిశు మరణాలు గణనీయంగా తగ్గాయి. గర్భిణులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించడమే దీనికి కారణం. - 8లో



ప్రీ ఆడిట్‌తో పారదర్శకత

ప్రభుత్వ పద్దులను ప్రీ ఆడిట్ విధానంలో చేయడం ద్వారా పారదర్శకంగా ఉంటుందని రాష్ట్ర ఆడిట్ డైరెక్టర్ ఆర్.హరిప్రకాష్ అన్నారు. - 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	40°	27°
ఇచ్ఛాపురం	40°	29°
పాతపట్నం	39°	28°
శ్రీకాకుళం	39°	28°

న్యూస్‌రీల్

11వ శతాబ్దం నాటి శిలాశాసనం పరిశీలన



శిలాశాసనాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి బృందం

పోలాకి: మండలంలోని దీర్ఘాశి గ్రామంలో 11వ శతాబ్దానికి చెందిన శిలా శాసనాన్ని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ శివనాగిరెడ్డి తన బృందంతో కలిసి మంగళవారం పరిశీలించారు. భగవతి అమ్మవారి ఆలయం, జగన్నాథస్వామి ఆలయంతోపాటు క్రీ.శ.1075లో ఏర్పాటు చేసిన గణపతి శాసనాన్ని గతంలో తెలుగులోకి అనువదించిన విషయాన్ని స్థానికులు అశోక్‌కుమార్, పి.వి.ఎస్.ఎన్.మూర్తి అధికారులకు వివరించారు. అనువాద పాఠాన్ని శిలాశాసనం వద్ద ఏర్పాటుచేసి పర్యాటకంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖాధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పీజీ సెట్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాలు, అఫిలియేషన్ కళాశాలల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఏపీ పీజీసెట్- 2023 ప్రవేశ పరీక్షలు మంగళవారం రెండు కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఎచ్చెర్ల శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 53 మంది, రెండో షిఫ్టులో 87 మంది, మూడో షిఫ్టులో 72 మంది హాజరయ్యారు. చిలకపాలెం శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఒకే షిఫ్టులో 110 మంది హాజరయ్యారు. ఈ నెల 10 వరకు పరీక్షలు జరగనున్నాయి.

ఏడుగురు ఎస్‌ఐలకు స్థాన చలనం

శ్రీకాకుళం క్రైమ్ : విశాఖపట్నం రేంజి డీఐజీ కార్యాలయం ఉత్తర్వుల మేరకు జిల్లాలో ఏడుగురు ఎస్‌ఐలకు స్థానచలనం చేస్తూ ఎస్పీ కార్యాలయం నుంచి మంగళవారం ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం వీఆర్‌లో ఉన్న వి.నేతాజీ, వి.వెంకటరావు, షేక్ ఖాదర్ బాషా, ఎం.డి.హసీన్, కె.వెంకటేష్(ట్రాఫిక్ పీఎస్ అటాచ్డ్)లను శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్‌ఐ-2, కాశీబుగ్గ, పాతపట్నం, శ్రీకాకుళం ట్రాఫిక్ పీఎస్‌లకు బదిలీ చేశారు. శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్‌ఐ-2, పాతపట్నం పీఎస్‌ల్లో ఉన్న మొజ్జాడ ప్రవల్లిక, జి.ప్రభాకరరావులను శ్రీకాకుళం వీఆర్, శ్రీకాకుళం డీపీటీసీలకు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



అశుతోష్ పాండేకు మొక్క అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. పర్యావరణ పరిరక్షణ, దేశ రక్షణ కోసం పది వేల కిలోమీటర్లు దేశవ్యాప్తంగా పాదయాత్ర చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన అశుతోష్ పాండే మంగళవారం శ్రీకాకుళం చేరుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయన్ను అభినందించి మొక్కను అందజేశారు. పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

లావేరు పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

లావేరు: లావేరు పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న బి.శ్రీనివాసరావును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాసరావు గతంలో రేగిడి మండలం అంబాడ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. 2018 నుంచి 2021 మధ్య పంచాయతీకి మంజూరైన 14, 15వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్ నిధులను స్వాహా చేశారని సర్పంచ్ చుక్కా వెంకటనాయుడు విజయనగరం జిల్లా కలెక్టర్, డీపీఓ, జెడ్పీ చైర్మన్లకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎల్‌పీవో మోహనరావు విచారణ నిర్వహించి జిల్లా అధికారులకు నివేదిక అందజేశారు. దీని ఆధారంగా శ్రీనివాసరావును కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఉత్తర్వు కాపీ అందిందని లావేరు ఇన్‌చార్జి ఎంపీడీఓ వి.విశ్వేశ్వరరావు మంగళవారం తెలిపారు.

అవయవదానం జై చిరంజీవం..

- శరీర, అవయవదానంపై పెరిగిన అవగాహన
- జిల్లాలో స్వచ్ఛందంగా ముందుకొచ్చిన 118 మంది
- మరణానంతరం మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లకు శరీరదానం
- 25 అవయవాల వరకు దానానికి అవకాశం



చంద్రకళ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు (ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్/జి.సిగడాం: పుట్టిన ప్రతి ఒక్కరూ మరణించకతప్పదు. అయితే కొంతమంది మాత్రం మరణించిన తర్వాత కూడా మనతోనే కలిసి ఉంటున్నారు. అవయవదానం చేసి ఇతరులకు పునర్జన్మ ఇచ్చి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. అవయవ, శరీర దానంపై ఇటీవల అవగాహన పెరగడంతో చాలామంది మరణానంతరం తమ అవయవాలను ఆపదలో ఉన్న వారికి అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. తాము మరణించినా మరికొంతమందికి ప్రాణదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



సోంపేట మండలానికి చెందిన విద్యార్థి మలిపెద్ది కిరణ్ చంద్ బ్రెయిన్ డెడ్ అయింది. ఆయన అవయవాలను దానం చేసేందుకు తల్లిదండ్రులు ముందుకు రావడంతో అవయవాలను విశాఖ, తిరుపతిలకు పంపించారు.



జి.సిగడాం వీఏవో చంద్రకళకు బ్రెయిన్ డెడ్ అయింది. ఆమె అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు రావడంతో విశాఖలో విమ్స్‌లో ఆమె అవయవాలను సేకరించారు.

ఇటీవల జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో నివాసముంటున్న జానకమ్మ సాధారణ మరణం అనంతరం ఆమె శరీరాన్ని జెమ్స్‌కు ఎన్‌జీవో ద్వారా అప్పగించారు.

ఎవరు దానం చేయవచ్చు..

శరీరాన్ని గాని, అవయవాలు గానీ ఎవరైనా దానం చేయవచ్చు. దానికి వయసుతో పనిలేదు. ఒక మనిషి జీవించి ఉండగానే తాను మరణానంతరం పలానా మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌కు శరీరాన్ని దానం చేస్తున్నానని స్వచ్ఛందంగా స్వదస్తూరితో రాసి ఇవ్వాలి. దానికి కూడా కుటుంబసభ్యుల సంతకం కూడా తీసుకోవాల్సి ఉంటుంది.

ఎంత సమయంలో సేకరించాలి..

మన శరీరంలోని అవయవాలను చనిపోయిన తరువాత సేకరించడానికి కొంత సమయం ఉంటుంది. కళ్లలోని కార్నియాను 6 గంటలలోపు సేకరించాలి. ఒక మనిషి నుంచి సేకరించిన రెండు కార్నియాల ద్వారా ఆరుగురికి నేత్రదానం చెయవచ్చు. గుండెను 4 గంటల నుంచి 6 గంటల వరకు, మూత్రపిండాలను 48 గంటల నుంచి 72 గంటల లోపు, కాలేయం 12 గంటల నుంచి 16గంటలలోపు సేకరించాలి.



ఇవి దానం చేయవచ్చు..

కళ్లు, హార్ట్ వాల్వ్స్, చర్మం, బోన్ టిష్యూ, ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు, పేగులు తదితర భాగాలను దానంగా ఇవ్వవచ్చు. సాధారణ మరణం సంభవిస్తే కేవలం కార్నియా(కళ్లు), హార్ట్‌వాల్, చర్మం, బోన్ టిష్యూలు మాత్రమే స్వీకరిస్తారు. బ్రెయిన్ డెడ్ సంభవిస్తే పైన తెలిపిన అన్ని అవయవాలు దానం చేయవచ్చు. ఇందులో మూత్రపిండాలు(కిడ్నీ), కాలేయం బతికి ఉండగానే దానం చేయవచ్చు.

శరీరదానం చేస్తే..

శరీరాన్ని దానం చేస్తే అది మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌కూ ఉపయోగపడుతుంది. మనవాళ్లు ఎవరైనా మరణించిన తరువాత కనీసం మూడు నెలల వరకు శరీరాన్ని అన్ని జాగ్రత్తలతో భద్రపరచి ఉంచుతారు. ఈ శరీరం మెడిసిన్‌లో అనాటమీ తరగతులకు ఉపయోగపడుతుంది.

అంతా చట్ట ప్రకారమే..

జాతీయ స్థాయిలో జీవన్‌దాన్ ట్రస్టు శరీర, అవయవదానాలు స్వీకరిస్తోంది. భారత్‌లో అవయవదానం, శరీర దానంపై 1994లోనే చట్టం తీసుకొచ్చారు. మన దేశంలో మన అనుమతితోనే దానం చేయాలి. శరీర దానానికి ఆసక్తి గల వారు మన జిల్లాలో రిమ్స్, జెమ్స్ కళాశాలలో సంప్రదించవచ్చు. శ్రీకాకుళంలో ఉన్న పుష్పాంజలి ఎవెకెనింగ్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఇప్పటి వరకు 118 మంది శరీరదానం, అవయవదానం కోసం ఒప్పంద పత్రాలను ఇచ్చారు.



అవగాహన కల్పిస్తున్నాం..

శరీరదానం, అవయవదానానికి ఇప్పటికే 118 మంది ఒప్పంద పత్రాలు ఇచ్చారు. దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే తమ సంస్థ ద్వారా నలుగురి శరీర, అవయవదానాలు జరిగాయి. సమాజంలో జీవిస్తున్న మనం.. తిరిగి సమాజానికి ఏం ఇవ్వగలమనే ఆలోచన ఉంటే మరణానంతరం ప్రతిఒక్కరూ శరీరదానానికి ముందుకురావాలి.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, అధ్యక్షుడు, అవేకింగ్ అండ్ చారిటబుల్ ట్రస్టు

కాపాడబోయి.. కానరానిలోకాలకు..

- వంశధార కాలువలో మునిగి డిగ్రీ విద్యార్థి మృతి



మృతిచెందిన వెంకటరమణ

కోటబొమ్మాళి: వంశధార కాలువలో స్నానానికి దిగిన ఇద్దరు చిన్నారులు ఈతరాక మునిగిపోతుండగా కాపాడేందుకు వెళ్లిన డిగ్రీ విద్యార్థి మృత్యువాతపడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటబొమ్మాళి మండలం పొడుగుపాడు గ్రామానికి చెందిన బొడ్డేపల్లి రామారావు పెద్ద కుమారుడు వెంకటరమణ(20) డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. మంగళవారం కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామం పక్కనే ఉన్న వంశధార ఎడమ కాలువ వద్దకు వెళ్లారు. ఇంతలో అదే గ్రామానికి చెందిన పదేళ్ల వయసు గల ఇద్దరు చిన్నారులు స్నానం చేసేందుకు కాలువలో దిగారు. ఈత రాకపోవడంతో మునిగిపోతూ కేకలు వేశారు. పరిస్థితిని గమనించిన వెంకటరమణ వెంటనే కాలువలోకి దూకి ఇద్దరినీ భుజంపై వేసుకుని ఒడ్డుకు చేర్చే ప్రయత్నం చేశాడు. అంతలోనే చిన్నారుల బరువును మోయలేక కాలువ బురదలో చిక్కుకొని మునిగిపోయాడు. ఇంతలో అటుగా వచ్చిన గ్రామస్తులు ఇద్దరు చిన్నారులను రక్షించి, మునిగిన వెంకటరమణను బయటకు తీశారు. స్పృహ కోల్పోయిన వెంకటరమణను కోటబొమ్మాళి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.

ఆదిత్యుని హుండీల లెక్కింపు రేపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియ ఈ నెల 8న ఉదయం 8 గంటల నుంచి ఆలయ అనివెట్టి మండపంలో నిర్వహిస్తున్నట్లు ఈవో వి.హరిసూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్టీసీ బస్సు బోల్తా



బోల్తాపడిన ఆర్టీసీ బస్సు

- కండక్టర్, డ్రైవర్‌తో సహా 13 మందికి గాయాలు
- వెంటనే అప్రమత్తమైన తహసీల్దార్, పోలీసులు



విజయలక్ష్మికి చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది



గాయపడిన కండక్టర్ కమలకుమారి



తీవ్రంగా గాయపడిన జె.సరోజిని

నరసన్నపేట : మండలంలోని కోమర్తి కూడలి సమీపంలో జాతీయ రహదారిపై శ్రీకాకుళం నుంచి పాతపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, కండక్టర్‌తో సహా 11 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం నుంచి పాతపట్నం ఎల్‌హెచ్ బస్సు మొదటి ట్రిప్ పాతపట్నం వెళ్లి వచ్చింది. రెండో ట్రిప్‌లో 17 మందితో శ్రీకాకుళం నుంచి పాతపట్నం వెళ్తుండగా కోమర్తి పైవంతెన డౌన్ వద్దకు వచ్చే సరికి బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో కె.జగదీశ్వరరావు(విజయనగరం జిల్లా బొండపల్లి), సత్యనారాయణ (ఆమదాలవలస), ఎస్.మన్మథరావు(శ్రీకాకుళం), టి.అప్పన్న, టి.లోకేష్, టి.సంతోషి, టి.సుజాత(గార), ఎస్.హారిక, ఎస్.నందిని (కొత్తూరు మండలం పెద్దగూడ), విజయలక్ష్మి(సవరబొంతు), జె.సరోజిని(మహాసింగి) డ్రైవర్ ఎం.తవుడు, కండక్టర్ కమలకుమారిలకు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన సరోజినిని మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మిగిలిన 12 మందికి నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే ఎన్‌హెచ్ అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న నరసన్నపేట తహసీల్దార్ ఏ.సింహాచలం, ఎంపీపీ ఆరంగి మురళీలు ప్రయాణికులకు చికిత్స చేయించారు. ఇదే సమయంలో టెక్కలి వెళ్తున్న జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి జె.భాస్కరరావు ఆస్పత్రికి వచ్చి వైద్యసేవలు పర్యవేక్షించారు. నరసన్నపేట ఎస్‌ఐ వై.సింహాచలం ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డంగా ఉన్న బస్సును పక్కకు తొలగించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. ప్రమాదానికి గల కారణాలను డ్రైవర్ తవుడు నుంచి సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదంపై ఎమ్మెల్యే ఆరా..

పోలాకి మండలంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉన్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ బస్సు ప్రమాదంపై ఆరా తీశారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. చికిత్స వివరాలకు జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి భాస్కరరావు ఎమ్మెల్యేకు ఫోనులో వివరించారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని తెలియజేశారు.

బస్సు కండీషన్ బాగానే ఉంది..

కాగా, బస్సు ప్రమాదానికి కారణం డ్రైవర్ అస్వస్థతకు గురి కావడమేనని, యాక్సిల్ విరగడం కాదని టెక్కలి, శ్రీకాకుళం-2 డిపో మేనేజర్లు శ్రీనివాసరావు, శర్మలు తెలిపారు. ఘటనా స్థలంలో ప్రమాదానికి గురైన బస్సును పరిశీలించామని, ఎండ తీవ్రతకు డ్రైవర్ అస్వస్థతకు గురై స్టీరింగ్‌పై పట్టు కోల్పోయారని, దీంతో రోడ్డు పక్కన ఉన్న రక్షణ గోడ పైకి బస్సు ఎక్కించారని, వెంటనే ఫ్రంట్ వీల్ టైర్ పంక్చర్ కావడంతో బస్సు బోల్తా పడిందని వివరించారు. ఈ మేరకు నిపుణులు నిర్ధారించారని తెలిపారు. బస్సు కండీషన్‌లోనే ఉందని స్పష్టం చేశారు.

సమాజాన్ని చైతన్యపరిచే రచనలు రావాలి



వీర కళింగం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి, మంత్రి ధర్మాన ప్రసాదరావు, వీసీ వెంకటరావు తదితరులు

- రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి
- మంత్రి ధర్మానతో కలిసి వీర కళింగం పుస్తకం ఆవిష్కరణ

ఎచ్చెర్ల క్యాంపస్ : సమాజ చైతన్యానికి రచనలు దోహదపడాలని రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం సెమినార్ హాలులో మంగళవారం రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ పూర్వ సంచాలకుడు డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ రాసిన 'వీర కళింగం' పుస్తకాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చరిత్రకు ఎప్పుడూ ప్రాధాన్యముంటుందని అన్నారు. వాస్తవాలు వక్రీకరించకుండా చరిత్రను నేటితరానికి అందించాల్సిన సామాజిక బాధ్యత రచయితలపై ఉందని చెప్పారు. పరిశోధన, చారిత్రక, సామాజిక అంశాలపై లోతైన పరిశోధనలతో కూడిన రచనలు రావాలన్నారు.

తెలుగ సాహిత్యానికి ఆదరణ...

తెలుగు సాహిత్యానికి ఎప్పటికీ తరగని ఆదరణ ఉంటుందని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నేటితరం ఆకర్షించేలా రచనలు కొనసాగాలని చెప్పారు. కళింగాంధ్ర సాహిత్యం, చరిత్రలపై మరిన్ని అధ్యయనాలు జరగాలన్నారు. ప్రాంతీయ ప్రగతికి, ప్రజల వ్యక్తిత్వ వికాసానికి రచనలు దోహదపడాలన్నారు. విశ్వవిద్యాలయాలు ఇటువంటి కార్యక్రమాలకు వేదిక కావటం వల్ల యువతకు స్ఫూర్తి లభిస్తుందని చెప్పారు.

కళింగాంధ్ర సాహిత్యం, భాష, మాండలికాలు ప్రత్యేకమైనవని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు వంటి వారు వ్యావహారిక భాషా ప్రగతికి కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో శివనాగిరెడ్డి, సాహితీవేత్తలు రాంభట్ల నృసింహశర్మ, అట్టాడ అప్పలనాయుడు, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, నల్లి ధర్మారావు, పట్నాల నరసింహమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు ఆర్.దివ్య, కార్యక్రమ సమన్వయకర్త జి.లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

రౌతుపోలమ్మ.. చల్లగా చూడమ్మా..!



సోంపేట మండలం పాలవలసలో రౌతు పోలమ్మ ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర్‌రెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– సోంపేట

జయహో మోహినీ భద్రాంబికా



గార మండలం శ్రీకూర్మం గ్రామదేవత మోహినీ భద్రాంబికా అమ్మవారి పండుగ మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఏటా జ్యేష్ఠమాసంలో జరిగే ఈ ఉత్సవానికి స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి అమ్మవారికి కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎస్‌ఐ ఎస్.కామేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

– గార

క్లుప్తంగా

వడదెబ్బకు గురైన పారిశుద్ధ్య కార్మికురాలు

పొందూరు: పారిశుద్ధ్య కార్మికురాలు వడదెబ్బకు గురైంది. మేజర్ పంచాయతీ పొందూరులో పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు పెంచాలని ఆరు రోజులుగా సమ్మెను చేస్తున్నారు. మంగళవారం సమ్మెలో పాల్గొన్న ఇంద్ర అనే కార్మికురాలు వడదెబ్బకు గురై సొమ్మసిల్లి పడిపోయింది. తోటి కార్మికులు సపర్యలు చేసి ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించడంతో కోలుకొంటుంది.

బ్రెయిన్‌డెడ్‌తో ఉపాధ్యాయుడు మృతి


గోవిందరావు(ఫైల్)

పొందూరు: బాణాం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మానాపురపు గోవిందరావు (46) బ్రెయిన్‌డెడ్ కారణంగా ప్రాణాలు కోల్పోయారు. తండ్యాం గ్రామానికి చెందిన గోవిందరావు మూడు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో విశాఖలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో కుటుంబసభ్యులు చేర్పించారు. బ్రెయిన్‌డెడ్‌గా గుర్తించి చికిత్స అందించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం ఉదయం మృతి చెందారు. మృతినికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గోవిందరావు మృతిపై ఎంఈవో రామరాజు, బాణాం మాజీ సర్పంచ్ పెద్దింటి రవిబాబు సంతాపం తెలియజేశారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం


గుర్తు తెలియని మృతదేహం

ఆమదాలవలస: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్ పరిధి ఆమదాలవలస మండలం దూసిరోడ్ రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం చోటుచేసుకున్నట్టు జీఆర్‌పీ హెచ్‌సీ చక్రధరరావు తెలిపారు. విశాఖ నుంచి పలాస వెళ్తున్న ట్రాక్‌పై మృతదేహం ఉండటాన్ని గుర్తించామన్నారు. మృతుని వయసు సుమారు 35 ఏళ్లు ఉంటుందని, ఆరంజ్ కలర్ టీ షర్టు వేసుకొని ఉన్నట్టు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ జీఆర్‌పీకి తెలియజేయాలని కోరారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇరువర్గాల కొట్లాటలో 8 మందికి గాయాలు


పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

బూర్జ : మండలంలోని కొల్లివలస గ్రామంలో జగ్గుపెల్లి వెంకటరావు, సైరిగాపు ఆనందరావు కుటుంబాల మధ్య మంగళవారం జరిగిన కొట్లాటలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనందరావు కుమార్తె, వెంకటరావు కుమారుడు ప్రేమించుకున్నారు. కొద్దిరోజుల కింద సదరు యువతి కోల్‌కతాలో ఉన్న తన చిన్నాన్న ఇంటికి వేసవి సెలవుల నిమిత్తం వెళ్లింది. విషయం తెలుసుకున్న యువకుడు అక్కడికి వెళ్లాడు. తర్వాత యువతీ యువకులు ఇద్దరూ కనిపించడం లేదని ఇరు కుటుంబాలకు సమాచారం అందింది. అప్పటి నుంచి గ్రామంలో ఇరు కుటుంబాల మధ్య వాగ్వాదం జరుగుతోంది. ఈక్రమంలో హైదరాబాద్ నుంచి వెంకటరావు అల్లుడు కొల్లివలస రావడంతో మళ్లీ గొడవ మొదలైంది. ఆనందరావు కుటుంబీకులు వెంకటరావు ఇంటి వద్దకు వెళ్లి తమ అమ్మాయి కోసం ప్రశ్నించడంతో మాటామాటా పెరిగి కొట్లాటకు దారితీసింది. ఈ ఘటనలో ఎనిమిది మందికి గాయాలు కావడంతో 108లో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇరు కుటుంబాల ఫిర్యాదు మేరకు ఎస్సై బి.అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,650–00
బంగారం(22సి. 10గ్రా.)	55,600–00
వెండి (కిలో)	78,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ.519.00
శ్రీకాకుళం	రూ.519.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹155	₹280	₹ 290

అమ్మ..బిడ్డ.. ఆనందం

- తగ్గిన మాతాశిశు మరణాలు
- రాష్ట్ర ప్రభుత్వ చర్యలే కారణం
- గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


సర్వజన ఆస్పత్రి ఎస్‌ఎన్‌సీయూలో చికిత్స పొందుతున్న చిన్నారులు

సారవకోట: రాష్ట్ర ప్రభుత్వం తల్లీబిడ్డల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అవసరమైన వైద్యం సేవలు సకాలంలో అందిస్తుండడంతో మూడేళ్లుగా మాతాశిశు మరణాల సంఖ్య తగ్గుతోంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రితో పాటు టెక్కలి జిల్లా ఆస్పత్రి, నరసన్నపేట ప్రభుత్వాస్పత్రుల్లో తల్లులతో పాటు పిల్లలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు న్యూ బార్న్ కేర్ యూనిట్లు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో అవసరమైన చిన్న పిల్లల వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని నియమించారు. సీహెచ్‌సీల్లో అందించిన వైద్యం తరువాత శిశువుకు ఇంకా మెరుగైన వైద్యం అవసరమైతే వెంటనే 108 వాహనాల ద్వారా శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నారు. దీంతో అమ్మ..బిడ్డ..ఆనందంగా ఉంటున్నారు.

పెద్దాస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు

శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని చిన్న పిల్లల విభాగంలో ఎస్‌ఐసీయూను ఏర్పాటు చేశారు. ఈ విభాగంలో నిత్యం పసి పిల్లలు చికిత్స పొందుతుంటారు. దీంతో పాటు ఇక్కడికి అధికంగా నెలలు నిండని, బరువు తక్కువగా ఉన్న శిశువులతో పాటు సెప్సిస్, శ్వాస సంబంధిత, పుట్టుకతో వచ్చే లోపాలు, సెప్టిసీమియా, మెనింజైటిస్, పసిరికలు వంటి అనారోగ్య సమస్యలతో చికిత్స కోసం వస్తుంటారు. ఇలాంటి వారి కోసం ఇక్కడి వైద్యులు పూర్తిస్థాయిలో వైద్యం అందించేందుకు కృషి చేస్తుంటారు.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

హైరిస్క్ గర్భిణులపై వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. దీంతో అలాంటివారు క్షేమంగా ఉంటున్నారు. ఇలాంటి వారికి కోసం తీసుకుంటున్న చర్యలు ఇలా ఉన్నాయి.

- గర్భం దాల్చిన సమయం నుంచి సంబంధిత వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి ఏఎన్‌ఎంల ద్వారా పర్యవేక్షణ
- ప్రతి నెల వైద్యులచే పరీక్షలు, టీకాలు, అవసరమైన మందుల పంపిణీ
- హైరిస్క్ గర్భిణుల పట్ల మెడికల్ ఆఫీసర్ దత్తత తీసుకుని ప్రత్యేకంగా పర్యవేక్షణ
- బీపీ, సుగర్ నియంత్రణలో ఉండేలా, రక్తహీనత లేకుండా కాన్పునకు మూడు రోజుల ముందుగానే ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించడం
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవసరమైన పోషకాహారాన్ని ప్రతి నెల అందించడం
- ప్రసవించాక శిశువుకు 14 నెలల వరకు అవసరమైన టీకాలను ఉచితంగా వేయడం
- ప్రసవం కోసం ఆస్పత్రికి రావడానికి, తిరిగి ఇంటికి వెళ్లేందుకు 108, 102 వాహనాల ఏర్పాటు
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రసవాలు జరిపించడం

రక్తహీనత నివారణపై దృష్టి

గర్భిణుల్లో రక్తహీనత నివారణపై వైద్య ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ఇందులో భాగంగా గర్భిణులకు కేటాయించిన ఆర్‌సీహెచ్ ఐడీతో ఆయా అంగన్‌వాడీ కార్యకర్తల యాప్‌లకు అనుసంధానం చేస్తున్నారు. రక్తహీనత కలిగి ఉన్న గర్భిణిపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి రక్తహీనత నుంచి వారిని కాపాడేందుకు అంగన్‌వాడీ, సచివాలయ ఏఎన్‌ఎంల ద్వారా నిత్యం వారిని పర్యవేక్షిస్తున్నారు. వారికి కావాల్సిన పౌష్టికాహారంతో పాటు ఐరన్, కాల్షియం, ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందజేస్తున్నారు.

జిల్లాలో మూడేళ్లలో శిశు మరణాల వివరాలు..

చైల్డ్ కేటగిరీ	2020-21	2021-22	2022-23
0 నుంచి ఒక నెల	280	178	132
నెల నుంచి ఒక సంవత్సరం	89	68	52
సంవత్సరం నుంచి ఐదేళ్లు	23	23	20
మొత్తం	392	269	204


బుడితి సీహెచ్‌సీలో బేబీ వార్మర్‌లో బిడ్డను పర్యవేక్షిస్తున్న నర్స్

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018-19 ఆర్థిక సంవత్సరంలో 455 శిశు మరణాలు జిల్లాలో నమోదయ్యాయి. కాగా ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో శిశు మరణాలు సగానికి పైగా తగ్గుముఖం పట్టాయి. ఈ మరణాల సంఖ్యను మరింత తగ్గించేందుకు వైద్యాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మరణాల తగ్గింపునకు చర్యలు



మాతాశిశు మరణాలు తగ్గించేందుకు ప్రతి నెల సమీక్షలు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా హైరిస్క్ గర్భిణీలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం. శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రితో పాటు జిల్లా ఆస్పత్రి, సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో చికిత్సకు అవసరమైన వసతులు, వైద్య సిబ్బంది నియామకం జరుగడంతో తల్లి, బిడ్డలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. ప్రతి నెల తొమ్మిదో తేదీన అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో గర్భిణులకు ప్రత్యేక కార్యక్రమం ద్వారా వైద్య సేవలందిస్తున్నాం.

–డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, డీఎంహెచ్‌ఎం

ప్రభుత్వ చర్యలు బాగున్నాయి



ప్రభుత్వం పీహెచ్‌సీ నుంచి పెద్దాస్పత్రుల్లో అన్ని సదుపాయాలు కల్పించింది. ఆధునాతన పరికరాలు అందుబాటులోకి రావడంతో ఏటా డెత్ రేటు తగ్గుతుంది. మరణాలను మరింత తగ్గించడానికి మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచే బిడ్డ ఏవిధంగా ఆరోగ్యం పెరగాలనే అంశంపై అవగాహన కల్పిస్తున్నాం. కొత్తగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్‌తో మరింత మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం.

–డాక్టర్ ఆర్‌వీఎస్ కుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

గ్రామదేవత విగ్రహాల చోరీ


చోరీకి గురైన గ్రామదేవత విగ్రహాలు (ఫైల్)

మందస: దున్నవూరు పంచాయతీ గెడ్డవూరు గ్రామదేవత పితాళి పోలమ్మతల్లి విగ్రహాలు చోరీకి గురయ్యాయి. శనివారం రాత్రి ఆలయానికి తలుపులు వేసి పూజారి చీకటి ఎర్రయ్య వెళ్లిపోయాడు. రెండు రోజుల తరువాత యథావిధిగా పూజలు చేయడానికి మంగళవారం ఆలయానికి చేరుకున్న పూజారి అప్పటికే తలుపులు తెరిచి ఉండడంతో కంగారు పడ్డారు. ఆలయంలోకి వెళ్లి చూడగా విగ్రహాలు కనిపించకపోవడంతో విషయాన్ని గ్రామస్తులకు తెలియజేశారు. దీంతో గ్రామ పెద్దలు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఉద్దానంలో ఎన్నడూలేని విధంగా కేవలం రాతి విగ్రహాను ఎందుకు దొంగతనం చేశారో అర్థం కాకపోవడంతో గ్రామస్తులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు. గెడ్డవూరు మత్స్యకార గ్రామం కావడంతో గ్రామదేవతను ఎంతగానో ఆరాధిస్తారు. ఈ సంఘటనపై మందస పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసుల ఔదార్యం

కంచిలి : అనారోగ్యంతో మృతి చెందిన యాచకురాలి మృతదేహానికి కంచిలి పోలీసులు అంత్యక్రియలు చేపట్టి ఔదార్యం కనబరిచారు. మండల కేంద్రం కంచిలి పట్టణంలోకి వచ్చేమార్గంలో జాతీయ రహదారి ఫ్లైఓవర్ కింద రెండు నెలల క్రితం నుంచి 70 ఏళ్ల వృద్ధురాలు నివాసం ఉండేది. అక్కడికి వచ్చిన వారిని యాచిస్తూ జీవనం గడిపేది. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఎస్.బాలరాజు, పోలీస్ సిబ్బంది మృతదేహాన్ని అక్కడి నుంచి తీసుకెళ్లి అంత్యక్రియలు చేపట్టారు.

మారుయాత్రకు తరలివచ్చిన భక్తజనం


అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి మారుయాత్ర మంగళవారం వైభవంగా జరిగింది. మొక్కులు చెల్లించేందుకు మహిళలు భారీగా తరలిరావడంతో నగరంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. గత నెల 21 నుంచి 30వ తేదీ వరకు పెద్ద పండుగలు జరిగాయి. మంగళవారం మారువారాల పండుగను భక్తితో నిర్వహించారు. ముగ్రాలటతో అమ్మవారి ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకుంటారు. పెద్దపండుగ తర్వాత మంగళవారం మారుయాత్ర నిర్వహించడం ఆనవాయితీ అని ఈవో టి.వాసుదేవరావు చెప్పారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సీఐ ఎం.వినోద్‌బాబు పర్యవేక్షణలో పాతపట్నం ఎస్‌ఐ జి.ప్రభాకరరావుతో పాటు పాతపట్నం, మెళియాపుట్టి పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ప్రీ ఆడిట్‌తో పారదర్శకత

- స్టేట్ ఆడిట్ డైరెక్టర్ హరిప్రకాశ్


శిక్షణ ఇస్తున్న స్టేట్ ఆడిట్ డైరెక్టర్ హరిప్రకాశ్

ఆమదాలవలస: ప్రభుత్వ పద్దులను ప్రీ ఆడిట్ విధానంలో చేయడం ద్వారా పారదర్శకంగా ఉంటుందని రాష్ట్ర ఆడిట్ డైరెక్టర్ ఆర్.హరిప్రకాష్ అన్నారు. ఈ విధానం ద్వారా నిధులు పదిలంగా ఉంటాయని చెప్పారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఆర్థిక శాఖ సమ్మతితో ప్రీ ఆడిట్ కార్యక్రమాన్ని ఈ ఏడాది నుంచి రాష్ట్రంలోని 123 పురపాలక సంఘాల్లో అమలు చేయనున్నట్లు వివరించారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా దేవదాయ శాఖలో ప్రీ ఆడిట్ విధానం అమలు చేయడం ద్వారా వాటి ఆదాయ మార్గాలు పెరిగినట్టు పేర్కొన్నారు. అలాగే పురపాలక సంఘాల్లో కూడా ఈ విధానం సీఎఫ్‌ఎంఎస్ ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు చెప్పారు. పోస్ట్ ఆడిట్‌తో ఏర్పడిన ఇబ్బందుల దృష్ట్యా రాష్ట్రంలోని అన్ని పురపాలక సంఘ కమిషనర్లు ప్రీ ఆడిట్ విధానానికి సుముఖత చూపారని స్పష్టం చేశారు. ఆడిట్ విధానం చట్టబద్ధత కలిగిన శాఖగా పేర్కొన్నారు. చేపట్టిన పనుల బిల్లులు చెల్లించే సమయంలో ముందస్తుగా ప్రీ ఆడిట్ చేయటంవలన పనుల్లో పారదర్శకత ఉంటుందన్నారు. పోస్ట్ ఆడిట్‌లో ఉన్న లోపాలను సవరించాల్సి వచ్చేదని, ప్రీ ఆడిట్‌తో నిధులు దుర్వినియోగం తగ్గుతోందన్నారు. ఈ విషయమై జీవో నంబర్ 74 ప్రకారం పురపాలక సంఘాల్లో ఈ ప్రక్రియ అమలు చేస్తామన్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి ఈ విధానానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. దేవదాయ శాఖలో 2,100 కోట్ల రూపాయల నిధులకు సంబంధించి ఆడిట్ నిర్వహించామని సుమారు 25 శాతం నిధులు దుర్వినియోగం కాకుండా కాపాడగలిగామన్నారు. చిత్తశుద్ధితో అమలు చేస్తున్న ఈ విధానం ద్వారా ఆడిటర్లకు ల్యాప్‌టాప్‌లను ప్రభుత్వమే సమకూరుస్తుందని వెల్లడించారు. ముందుగా నూతన ఆడిట్ విధానంపై ఇచ్ఛాపురం, పలాస, ఆమదాలవలస శ్రీకాకుళం మున్సిపల్ ఉద్యోగులకు, ఆడిటర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. ఆర్థిక సంఘం మార్గదర్శకాల ప్రకారం గడువులోగా ఆడిట్ ప్రక్రియ పూర్తి చేయవలసి ఉందన్నారు. సమావేశంలో విశాఖపట్నం ప్రాంతీయ సహాయ ఆడిట్ డైరెక్టర్ పి.సీతారామారావు, ఆమదాలవలస, ఇచ్ఛాపురం, పలాస–కాశీబుగ్గ కమిషనర్లు రవిసుధాకర్, రమేష్, నాగేంద్ర, అసిస్టెంట్ ఆడిటర్ రామన్న, సూర్యారావు, మురళీకృష్ణ, రామ్మోహన్ రావు, అప్పారావు, సీనియర్ ఆడిటర్లు సుందర్‌రావు, జ్యోతి ప్రసాద్, హేమలత, రవికుమార్, రాజు, ప్రదీప్, హేమమూర్తి పాల్గొన్నారు.

• మానవత్వం చాటుదాం



ఒడిశా రాష్ట్రం బాలాసోర్ సమీపంలో ఇటీవల జరిగిన రైలు ప్రమాద మృతులను ఒకే ట్రక్కులో తరలించడంపై సైకత శిల్పి గేదెల హరికృష్ణ మంగళవారం సైకత శిల్పం రూపొందించారు. దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అనే భావన అందరూ కలిగి ఉండాలని గుర్తు చేస్తూ గాజులకొల్లివలస సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద వేసిన ఈ సైకత శిల్పాన్ని అందరూ ఆసక్తిగా తిలకించారు.

- ఆమదాలవలస రూరల్

అన్నదాత సంక్షేమమే ధ్యేయం

- స్పీకర్ తమ్మినేని సీతారాం


యంత్ర పరికరాలను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: అన్నదాత సంక్షేమమే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించి వైఎస్సార్ యంత్ర సేవా పథకం రెండవ విడత కింద రైతులకు యంత్ర పరికరాలను అందజేసే కార్యక్రమాన్ని పట్టణంలోని స్పీకర్ క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతును బలోపేతం చేయడానికి చిత్తశుద్ధితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేనంతగా మన రాష్ట్రంలో రైతులకు మేలు జరుగుతోందన్నారు. ఖరీఫ్ సీజన్ ముందు రైతు భరోసా నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా ఆధునిక పనిముట్లను అందుబాటులో ఉంచుతున్నట్టు పేర్కొన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలోని వ్యవసాయ సలహా మండలి నిర్దేశించిన అద్దె మేరకు యంత్ర పరికరాలను అందజేస్తున్నామని.. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు పది మందికి అన్నం పెట్టే వాడిగా బతకాలేగాని చేయిచాచే విధంగా ఉండకూడదని భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి అన్ని విధాలా అండగా నిలుస్తున్నారన్నారు. యంత్ర పరికరాల పంపిణీలో ప్రభుత్వం 40 శాతం సబ్సిడీగా, 50 శాతం బ్యాంకు రుణంగా అందజేస్తుందని, పది శాతం మాత్రమే గ్రూప్ సభ్యులు చెల్లిస్తే సరిపోతుందని వివరించారు. ఒక్కో రైతు భరోసా కేంద్రానికి రూ. 15 లక్షల విలువైన యంత్ర పరికరాలను సమకూరుస్తున్నట్టు చెప్పారు. రైతులకు విత్తనం నుంచి విక్రయం వరకు జరిగే ప్రక్రియ ఆర్‌బీకేల ద్వారానే జరుగుతోందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం సాధించేలా రైతులకు వ్యవసాయ అధికారులు మెలకువలు, సూచనలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, వ్యవసాయ శాఖ జేడీ కె.శ్రీధర్, శ్రీకాకుళం ఏడీఏ బగ్గు రజిని, రణస్థలం ఏడీఏ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేతనదారులు ఫిర్యాదు


ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేస్తున్న వేతనదారులు

సంతబొమ్మాళి: నౌపడ ఫీల్డ్ అసిస్టెంట్ సీలావు ప్రసాద్‌రెడ్డి ఇష్టానుసారంగా వ్యవహస్తున్నారని ఆరోపిస్తూ వేతనదారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని అడిగితే ఏకంగా జాబ్ కార్డునే తొలగించారని వేతనదారుల ఆరోపణ. వివరాల్లోకి వెళితే నౌపడ గ్రామానికి చెందిన వేతనదారులు 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పని చేసినా ఇంతవరకు బిల్లులు అకౌంట్లలో జమ కాలేదు. దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్‌రెడ్డిని వేతనదారులు పలుమార్లు అడిగినా పట్టించుకోలేదు. వేతనాలు చెల్లించక పోవడమే కాకుండా మూడు వారాలుగా పని కూడా కల్పించలేదు. దీనిపై అడిగినా కుంటి సాకులు చెప్పి తప్పించుకున్నాడు. దీంతో విసిగిపోయిన వేతనదారులు మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయానికి మంగళవారం వచ్చి అధికారులకు అతనిపై ఫిర్యాదు చేశారు. కొంతమంది జాబ్ కార్డులను సైతం తొలగించినట్టు ఈ సందర్భంగా వెలుగు చూసింది. దీంతో వేతనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. చేసిన పనికి బిల్లులు చెల్లించలేదు సరికదా జాబ్ కార్డులను తొలగించడం ఏమిటని వేతనదారులు రోకళ్ల కామమ్మ, కర్రీ లీలామోహన్, రోకళ్ల లక్ష్మి తదితరులు ప్రశ్నించారు. సుమారు 50 మందికి వేతనాలు చెల్లించలేదని వేతనదారులు వాపోయారు. ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్‌రెడ్డిపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఏపీవో బి.వాసునాయుడు మాట్లాడుతూ.. వేతన దారులకు తెలియకుండా జాబ్ కార్డు తొలగించరాదన్నారు. దీనిపై విచారణ జరిపి వాస్తమని తెలితె తీసుకుంటామన్నారు. వేతనదారులందరికీ న్యాయం చేస్తామని చెప్పారు.

మహాసాహెబ్‌పేటలో అధికారుల పర్యటన

- వైద్య శిబిరం ఏర్పాటు


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఎంహెచ్‌వో మీనాక్షి

కోటబొమ్మాళి: డయేరియా ప్రబలిన మహాసాహెబ్ పేటలో అధికారులు మంగళవారం పర్యటించారు. గ్రామంలో డయేరియా ప్రబలి 29 మంది ఇబ్బంది పడిన నేపథ్యంలో టెక్కలి సబ్‌కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి గ్రామానికి చేరుకొని ఆరా తీశారు. డయేరియా ప్రబలిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు చెందిన వాట్సాప్ గ్రూపులో సకాలంలో షేర్ చేయకపోవడంపై కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారికి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని సబ్ కలెక్టర్ డీఎంహెచ్‌వోను ఆదేశించారు. మంచినీటి వనరులను పరిశీలించారు. మంచినీటి బావుల్లో, వీధుల్లో క్లోరినేషన్ చేయాలని, వైద్య శిబిరాన్ని కొనసాగించాలన్నారు. డయేరియా అదుపులో ఉందని..పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకూ అందుబాటులో ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. సర్పంచ్ ఎస్.ధనలక్ష్మి, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ, డిప్యూటీ తహసీల్దార్ ఆర్.మధు, ఆర్‌ఐ శివరామక్రిష్ణ,వీఆర్‌ఓ అనిల్ పాల్గొన్నారు.

ఒకరి బదులుగా మరొకరికి పరిహారం జమ


సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న జానకిరామ్

కొత్తూరు: వంశధార ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు తీసుకున్న నిర్వాసిత రైతులకు ప్రభుత్వం అందజేసిన అదనపు పరిహారం మంజూరులో తమకు అన్యాయం జరిగిందని కొత్తూరు మండలం మెట్టూరు బిట్ –1 ఆర్‌ఆర్ కాలనీకి చెందిన బర్రి జానకి రామ్ మంగళవారం టెక్కలి సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తన తండ్రి బర్రి అప్పన్నకు చెందిన 5.87 ఎకరాల భూమికి ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు పరిహారం రూ.5.87 లక్షలను అదే కాలనీలో నా తండ్రి పేరుతో ఉన్న భూములు లేని వ్యక్తి బ్యాంకు ఖాతాకు కొత్తూరు రెవెన్యూ అధికారులు ఉద్దేశపూర్వకంగా అక్రమాలకు పాల్పడి జమ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు వ్యక్తికి యూత్ ప్యాకేజి కింద లక్ష రూపాయల అదనపు పరిహారం సైతం జమ చేశారని తెలిపారు. ఈ విషయమై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.